వివిధ లా కోర్సుల పరీక్షా ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 1: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ లా కోర్సుల పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల ఎల్ఎల్‌బీ, మూడేళ్ల ఎల్ఎల్‌బీ ఆనర్స్, ఐదేళ్ల బీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీకామ్ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీబీఏ ఎల్ఎల్‌బీ తదితర కోర్సుల సెమిస్టర్ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.in లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

ఎంఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ (హెచ్ఐ/ఐడీ) రెండో సెమిస్టర్ రెగ్యులర్, మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షా ఫీజును ఈ నెల 9లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలన్నారు. రూ.200 అపరాధ రుసుముతో 12వ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను ఈ నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

నకలు పొందేందుకు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ దూర విద్యా కేంద్రమైన ప్రొఫెసర్ జి. రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ద్వారా అందించే ఎంబీఏ పరీక్షల జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ కోర్సు మొదటి, మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. జవాబు పత్రాల నకలు పొందేందుకు ఒక్కో పేపర్‌కు రూ.1,000 చొప్పున చెల్లించి ఈ నెల 14లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

అడ్డగుట్ట: చంద్రయ్య హోటల్ వద్ద రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మీ శ్రీనివాస్, పార్టీశ్రేణులు

సీతాఫల్‌మండి చౌరస్తాలో నిరసన తెలుపుతున్న సికింద్రాబాద్ కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ,నాయకులు

భగ్గుమన్న బీఆర్ఎస్

నియోజకవర్గాల్లో రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మ దహనం

మహిళా ఎమ్మెల్యేపై సీఎం రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు ● క్షమాపణ చెప్పాలంటూ బీఆర్ఎస్ నాయకుల డిమాండ్

అడ్డగుట్ట/సికింద్రాబాద్ , ఆగస్టు 1 : నిండు సభలో అత్యున్నతమైన సీఎం హోదాలో ఉండి మహిళా ఎమ్మెల్యేలను అవమాన పరిచే రీతిలో వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్ రెడ్డి వ్యవహారశైలికి వ్యతిరేకంగా సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మా రావు ఆదేశాల మేరకు అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీశ్రేణులు చంద్రయ్య హోటల్ వద్ద ప్రధాన రోడ్డుపై బైఠాయించి పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. అహంకారపూరితంగా అనుచిత వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి బేషరత్‌గా మహిళా ఎమ్మెల్యేలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు లింగాని శ్రీనివాస్, పెండెం మనోహర్, మహ్మద్, వసంత, ఎల్లయ్య, అమర్ బాన్సోడే, రామప్ప చారి, శ్యామ్‌సన్, మల్లేష్, దేవయ్య, శ్రీ రాములు, నర్సింగ్, అయోధ్య, శంకర్, విజయ, విమల, శారదా, రమా తదితరులు పాల్గొన్నారు.

సీఎం దిష్టి బొమ్మను దహనం చేస్తున్న కార్పొరేటర్‌లు హేమ,శైలజ,నేతలు

క్షమాపణ చెప్పాలి

మహిళా ఎమ్మెల్యేలను అగౌరవ పరచిన సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే వారికి క్షమాపణ చెప్పాలని సికింద్రాబాద్ కార్పొరేటర్‌లు సామల హేమ, కంది శైలజ ,బీఆర్ఎస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. కార్పొరేటర్‌లు హేమ,శైలజలు నాయకులతో కలిసి సీతాఫల్‌మండి చౌరస్తాలో అసెంబ్లీలో మహిళా ఎమ్మెల్యేలపై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. సీఎం స్థాయిని మరచి మహిళలను అగౌరవ పరిచడం సరికాదన్నారు.అదే విధంగా అక్కలను నమ్ముకుంటే బతుకు బస్టాండ్ అని రేవంత్‌రెడ్డి అనడం ఆయన దిగుజారుడు విధానానికి నిదర్శనం అని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కంటోన్మెంట్‌లో సమస్యలు పరిష్కరించాలి

మారేడ్‌పల్లి, ఆగస్టు 1: కంటోన్మెంట్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ.. ఢిల్లీలో కంటోన్మెంట్ డైరెక్టర్ జనరల్, డీజీడీఈ రాజేశ్వరన్, అదనపు డీజీ సోనమ్ యాంగ్డోల్‌లను బోర్డు నామినేటెడ్ సభ్యుడు జే. రామకృష్ణ గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జే. రామకృష్ణ మాట్లాడుతూ.. కంటోన్మెంట్‌లో కొత్త బిల్డింగ్ బై-లాస్, పెండింగ్ సర్వీ స్ ఛార్జీలను విడుదల చేయాలని కోరినట్లు తెలిపారు. రక్షణ శాఖ భూముల పక్కనే ఉన్న పౌర ప్రాంతాల్లోని దేవాలయాల కోసం ప్రత్యేక మార్గాన్ని ఏర్పాటు చేయాలని, భూ మార్పిడి విధానాన్ని అవలంబించడం, ఎ1,బి4, ఇతర రక్షణ భూముల్లో మురికి వాడల నివాసితులకు పునరావాసం కల్పించాలని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అదేవిధంగా కంటోన్మెంట్ అభివృద్ధి కోసం అదనపు నిధులు కేటాయించాలని, రెండు స్కై వేలకు ప్రతిపాదిత రోడ్డు విస్తరణ వెడల్పును తగ్గించాలని అధికారులకు వివరించినట్లు పేర్కొన్నారు

కంటోన్మెంట్ డైరెక్టర్ జనరల్, డీజీడీఈ రాజేశ్వరన్‌కు వినతిపత్రం అందజేస్తున్న బోర్డు నామినేటెడ్ సభ్యుడు జే. రామకృష్ణ

డిప్యూటీ మేయర్‌ను కలిసిన జలమండలి నూతన డీజీఎం

తార్నాక డివిజన్ జలమండలి నూతన డిప్యూటీ జనరల్ మేనేజర్ (డీజీఎం)గా బాధ్యతలు చేపట్టిన నాజరిన్ నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డిని గురువారం తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంపు కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ ప్రజలకు నీటి సరఫరాలో ఎటువంటి అంతరాయం ఉండకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతె శోభన్‌రెడ్డి పాల్గొన్నారు.

– ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 1

ఎల్వోసీ అందజేత

రెండో వార్డు కట్టమైసమ్మ కృష్ణానగర్ కు చెందిన ఎం.నరసయ్య కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు.ఈ మేరకు మెరుగైన వైద్యం నిమిత్తం సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ.2లక్షల 50వేల ఎల్వోసీని గురువారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సామ్సన్ రాజ్ బాధితుడికి, భార్య అనసూయకు అందజేశారు.– బొల్లారం

తల్లి పాలే బిడ్డకు ఆరోగ్యం

బన్సీలాల్‌పేట్, ఆగస్ట్ 1 : తల్లిపాలే బిడ్డకు ఆరోగ్యమని, బిడ్డ పుట్టిన తరువాత ఆరు మాసాల వరకు తల్లి పాలు పట్టించాలని, అది బిడ్డకు, తల్లికి ఎంతో మేలు చేస్తుందని పద్మారావు నగర్ హమాలీబస్తీలోని బస్తీ దవాఖాన మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజ్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా తల్లులకు, గర్భిణులకు అవగాహన శిబిరం నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ కుల్సుమ్ మాట్లాడుతూ.. ముర్రుపాలలో వ్యాధి నిరోధకాలు ఎక్కువగా ఉంటాయని అన్నారు. తల్లి పాల ప్రాముఖ్యతను వివరించేందుకు వారం రోజుల పాటు వివిధ అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు.

తల్లి పాల ప్రాముఖ్యత గురించి వివరిస్తున్న డాక్టర్ రాజ్‌కుమార్, అంగన్‌వాడీ టీచర్ కుల్సుమ్

నిమ్స్‌పై వచ్చే ఫేక్ కథనాలను నమ్మకండి

ఖైరతాబాద్, ఆగస్టు 1: నిమ్స్ దవాఖానపై కొన్ని సామాజిక మాధ్యమాల్లో ఫేక్ కథనాలు వస్తున్నాయని, వాటిని నమ్మవద్దని డైరెక్టర్ డాక్టర్ బీరప్ప గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నిమ్స్‌లో ఓ రోగి చనిపోయాడని, అతడి కుటుంబ సభ్యులకు డెత్ సర్టిఫికెట్ ఇచ్చి పంపామని, తదనంతరం ఆ వ్యక్తి లేచి కూర్చున్నాడంటూ ఓ సామాజిక మధ్యమం వేదికగా అసత్యపు కథనాలు వచ్చాయని, కొందరు వాటిని అదే మాధ్యమాల్లో విస్తరించారని తెలిపారు. నిమ్స్‌లో ఆ కథనంలో వచ్చిన పేరుతో రోగులెవరూ అడ్మిట్ కాలేదని, ఇది పూర్తిగా నిరాధారమైన కథనమన్నారు. ఇలాంటి కథనాలను వేసే ముందు నిమ్స్ యాజమాన్యాన్ని సంప్రదించాలన్నారు.

ఏకాగ్రతతో విధులు నిర్వహించాలి

నార్త్ జోన్ అడిషనల్ డీసీపీ డాక్టర్ పగడాల అశోక్ కుమార్

ఉత్తమ డ్రైవర్లను శాలువాతో సత్కరించి అవార్డును అందజేస్తున్న అడిషనల్ కమిషనర్ డాక్టర్ పగడాల అశోక్‌కుమార్, సికింద్రాబాద్ రీజినల్ మేనేజర్ ఖుష్రోషాఖాన్

మారేడ్‌పల్లి, ఆగస్టు 1: విధి నిర్వహణలో ఆర్టీసీ డ్రైవర్లందరూ ఏకాగ్రతతో విధులు నిర్వహించినప్పుడే...ఉత్తమ డ్రైవర్లుగా గుర్తింపు పొందుతారని ఉత్తర మండలం అడిషనల్ కమిషనర్ డాక్టర్ పగడాల అశోక్ కుమార్, ఆర్టీసీ సికింద్రాబాద్ రీజినల్ మేనేజర్ ఖుష్రోషాఖాన్‌లు అన్నారు. గురువారం కంటోన్మెంట్ డిపోలో నిర్వహించిన ఆర్టీసీ సికింద్రాబాద్ రీజియన్ ప్రమాదరహిత వారోత్సవాల ముగింపు కార్యాక్రమానికి వారు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఆర్టీసీ సంస్థలో ఉద్యోగులు, డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది అందరూ కలిసి సమష్టిగా పని చేస్తేనే సంస్థకు మనుగడ ఉంటుందన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు డ్రైవర్లు ఏకాగ్రతతో విధులు నిర్వహించాలన్నారు. అప్పుడే సంస్థలో వారికి తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. 30 ఏండ్ల నుంచి ఎలాంటి ప్రమాదాలు చేయకుండా విధులు నిర్వహిస్తున్న 14 మంది ఉత్తమ డ్రైవర్లుగా అవార్డులను అందుకోవడం ఎంతో సంతోషకరమన్నారు. వారిని ఆదర్శంగా తీసుకొని మిగితా డ్రైవర్లు కూడా ఏకాగ్రతతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ రీజినల్ డిప్యూటీ ఆర్ఎంలు కవిత, సురేష్ చౌహాన్, బీమ్‌రెడ్డి, డిపో మేనేజర్లు సుధాకర్‌రావు, హరి, మురళీధర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, ఎంఎఫ్‌లు, ట్రాఫిక్ అసిస్టెంట్ మేనేజర్‌లు పాల్గొన్నారు.

నగరంలో బస్సుల సంఖ్య పెంచాలి

అడ్డగుట్ట, ఆగస్టు 1 : సీపీఎం సికింద్రాబాద్ జోన్ ఆధ్వర్యంలో తుకారాంగేట్ బస్‌స్టాప్ వద్ద గురువారం ప్రజల నుంచి సంతకాలను సేకరించారు. ఈ సందర్భంగా జోన్ నాయకులు అజయ్‌బాబు మాట్లాడుతూ.... నగరంలో ట్రాఫిక్ సమస్య తీవ్రతరమైందని, కాలుష్యరహిత పరిస్థితులను ఏర్పాటు చేసే దిశగా అడుగులు వేయాలని అన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం బస్సుల సంఖ్యను పెంచాలని, మెట్రో రైలు బోగీలను 3 నుంచి 6కు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు మల్లేష్, డానియల్, నవీన్, ప్రేమలత, లక్ష్మితో పాటు తదితరులు పాల్గొన్నారు.

తుకారాంగేట్‌లో సంతకాలను సేకరిస్తున్న సీపీఎం నాయకులు

అభినందనలు..

యువతిపై లైంగిక దాడికి పాల్పడిన యువకుడు విదేశాలకు పారిపోతున్న క్రమంలో సికింద్రాబాద్ మహంకాళి పోలీసులు సదరు యువకుడిని ఇటీవల శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో చాకచక్యంగా పట్టుకున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ కొత్త కోట శ్రీనివాస్‌రెడ్డి మహంకాళి ఇన్‌స్పెక్టర్ పరశురాం, స్టేషన్ సిబ్బందిని గురువారం కమిషనర్ కార్యాలయంలో అభినందించి నగదు బహుమతిని అందజేశారు.
–బేగంపేట్

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

బేగంపేట్, ఆగస్టు 1: నా చావుకు ఎవరు బాధ్యులు కాదు..నేను చేసుకున్న అప్పుల వలన చనిపోతున్నాను అంటూ సెల్ఫీ వీడియో తీసుకొని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మార్కెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పద్మారావునగర్‌లో నివాసం ఉంటున్న ఉమ్మగోని లలిత్ గౌడ్(24) సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. గురువారం సికింద్రాబాద్ మార్కెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాష్ట్రపతి రోడ్డులో ఉన్న ఓయో టౌన్‌హౌస్ హోటల్‌లో రూమ్ నెంబర్ 108 గదిని అద్దెకు తీసుకొని బెడ్‌షీట్‌తో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హోటల్ నిర్వాహకులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ పార్కింగ్ అరికట్టే దిశగా...

అమీర్‌పేట్, ఆగస్టు 1 : అమీర్‌పేట్ సత్యం థియేటర్ చౌరస్తా నలువైపులా ఎక్కడికక్కడ టీ, టిఫిన్ సెంటర్లు ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తూ తమ వ్యాపారాలు సాగిస్తున్నాయి. వీటికి తోడు ఆయా సెంటర్లకు వస్తున్న కస్టమర్లు తమ వాహనాలను రోడ్లపైనే పార్కింగ్ చేస్తూ సమస్యలు సృష్టిస్తున్నారు అక్రమ పార్కింగ్‌పై ట్రాఫిక్ అధికారులకు వరుస ఫిర్యాదులు అందుతున్నాయి. దీంతో నిబంధనలకు విరుద్ధంగా ఎక్కడికక్కడ రోడ్లపై పార్కింగ్ చేసిన వాహనాలను ఎస్ఆర్‌నగర్ ట్రాఫిక్ ఎస్ఐ కాంతారావు ఆధ్వర్యంలో పోలీసులు గురువారం ట్రాఫిక్ వ్యాన్‌పై ఎక్కించి పీఎస్‌కు తరలించారు. రోడ్లపై ఇబ్బందులు కలిగించే అక్రమ పార్కింగ్‌ను ఉపేక్షించేది లేదని ఎస్ఆర్‌నగర్ ట్రా ఫిక్ ఎస్ఐ కాంతారావు స్పష్టం చేశారు.

రోడ్లపై పార్కింగ్ చేసిన వాహనాలను ట్రాఫిక్ వ్యాన్‌లో ఎక్కిస్తున్న పోలీసులు

4న సాయన్న మెమోరియల్ క్రీడా పోటీలు

మారేడ్‌పల్లి, ఆగస్టు 1: దివంగత మాజీ ఎమ్మెల్యే సాయన్న మెమోరియల్ కప్ పేరుతో ఈ నెల 4న మారేడ్‌పల్లిలోని మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లో 1వ నేషనల్ లెవల్ కుంగ్‌ఫూ చాంపియన్ షిప్-2024 క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ సీనియర్ నేత నివేదిత తెలిపారు. గురువారం కార్యాలయంలో తన నివాసంలో సాయన్న మెమోరియల్ కప్ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కంటోన్మెంట్ ప్రజలకు ఎన్నో సేవలందించిన దివంగత మాజీ ఎమ్మెల్యే సాయన్న పేరుతో మొదటి సారిగా ఈ పోటీలను నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఆర్గనైజర్ సురేందర్, ఆర్గనైజర్ వంశీ, బీఆర్ఎస్ నాయకులు ఆనంద్, శేఖర్, మధు, మురళీ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ సీనియర్ నేత నివేదిత, తదితరులు

మహాగణపతికి పాదపూజ

నేడు విగ్రహ నమూనా ఆవిష్కరణ

ఖైరతాబాద్, ఆగస్టు 1: ఖైరతాబాద్‌లో కొలువదీరనున్న మహాగణపతి మట్టి విగ్రహ పనులు గురువారం ప్రారంభమయ్యాయి. ఇప్పటి వరకు స్టీలు, వైర్లతో విగ్రహ రూపాన్ని తయారు చేశారు. సుమారు 70 అడుగుల ఎత్తులో నిర్మిస్తున్న విగ్రహ పాదాలను తొలుత మట్టితో అంకురార్పణ చేశారు. ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో స్వామి వారికి పాదపూజ నిర్వహించారు. నేడు స్వామి వారి పూర్తి నమూనాను ఆవిష్కరిస్తామని ఉత్సవ కమిటీ చైర్మన్ సింగరి రాజ్ కుమార్ తెలిపారు.

వర్గీకరణ తీర్పుతో.. సంబురాలు

ఉస్మానియా యూనివర్సిటీ/సికింద్రాబాద్/బన్సీలాల్‌పేట్, ఆగస్టు 1: ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన నేపథ్యంలో వివిధ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీలో సంబురాలు జరుపుకున్నారు. విద్యార్థులు ఆర్ట్స్ కళాశాల ఆవరణలో పెద్ద ఎత్తున రంగులు చల్లుకుంటూ, టపాసులు పేల్చి, కేక్ కట్ చేసి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ముప్పై ఏళ్ల సుదీర్ఘ పోరాటంలో అంతిమంగా ధర్మమే గెలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో మాదిగ ప్రొఫెసర్లు గడ్డం మల్లేశం, విజయలక్ష్మి, కొర్రెముల శ్రీనివాస్, నతానియల్, మేడి శ్రీనివాస్, ఇంద్రకంటి శేఖర్, విద్యార్థి నాయకులు కొమ్ము శేఖర్, మంద రాజు, సోమశేఖర్, రామారపు శ్రీనివాస్, పల్లెర్ల సుధాకర్, నలిగంటి శరత్, వలిగొండ నరసింహ, వేల్పుల సంజయ్, జంగిలి దర్శన్, తాళ్ల అజయ్, బంజూరు విజయ్, లత, సుజాత, జన్నపాల మహేశ్, రాజీవ్ ప్రదీప్, ఎడవెల్లి అజయ్, అరవింద్, శ్రీకాం త్, నవీన్, రవీందర్, హరి, బాలు, నాగేంద్ర, పరమేశ్ పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పునకు అభినందనలు

ఎస్సీ ,ఎస్టీ వర్గీకరణకు సుప్రీంకోర్టు అనుకూలంగా తీర్పు ఇచ్చినందుకు సుప్రీంకోర్టు న్యాయవాదులు చీఫ్ జస్టిస్‌లు అందరికీ శిరస్సు వంచి అభినందనలు తెలుపుతున్నానని బీజేఫబు జిల్లా ప్రధాన కార్యదర్శి ,సికింద్రాబాద్ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి మేకల సారంగపాణి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



ఓయూలో సంబురాలు చేసుకుంటున్న ప్రొఫెసర్లు, విద్యార్థి నాయకులు

సుప్రీంకోర్టు తీర్పుపై దళిత సంఘాల హర్షం

ఎస్సీ వర్గీకరణ పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సంఘం, రాష్ట్ర అధ్యక్షుడు డి.సుదర్శన్‌బాబు అన్నారు. సామాజిక న్యాయ సాధన కోసం మూడు దశాబ్దాల సుదీర్ఘ పోరాటానికి ఇప్పుడు న్యాయం లభించిందని, ఈ తీర్పు ద్వారా విద్యా, ఉద్యోగ, ఉపాధి రంగాలలో మాదిగ, మాదిగ ఉపకులాల నిరుపేదలకు న్యాయం లభిస్తుందని ఆయన అన్నారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును రెండు తెలుగు రాష్ట్రాలు వెంటనే అమలు చేయాలని, అప్పటి వరకు ఉద్యోగ నియామకాలను ఆపివేయాలని ఆయన కోరారు. గురువారం బన్సీలాల్‌పేట్, న్యూబోయిగూడ, చాచానెహ్రూనగర్, ఐడీహెచ్ కాలనీ, గొల్లకొమరయ్య కాలనీ, బీజేఆర్ నగర్‌లలో స్థానికులు డాక్టర్ బీఆర్.అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ జంట విగ్రహాలకు క్షీరాభిషేకం చేసి సంబురాలు జరుపుకున్నారు.

ఎమ్మార్పీఎస్ దక్షిణాది రాష్ట్రాల కోఆర్డినేటర్ రాగటి సత్యం, కార్పొరేటర్ హేమలతను సన్మానిస్తున్న బీజేఆర్ నగర్ ప్రజలు

ఐడీహెచ్ కాలనీలో అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకటేశన్ రాజు , తదితరులు